క్లుప్తంగా

22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు


సామూహిక వరలక్ష్మీ వ్రతాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న కృష్ణబాబు

కిర్లంపూడి: అన్నవరం సత్యదేవుని సన్నిధిలో ఈ నెల 22న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు సత్యదీక్ష ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు తెలిపారు. మండలంలోని కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి, భూపాలపట్నం, వేలంక గ్రామాల్లో సోమవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహిళా భక్తులకు కరపత్రాలను పంపిణీ చేశారు. వ్రతాల్లో పాల్గొనే భక్తులు కొబ్బరి కాయలు, అరటి పండ్లు, పువ్వులు తమ వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉల్లూరి త్రిమూర్తులు, అదారి అరుణ్ కుమారి, కృష్ణతులసి, నాగమణి, సూరికుమారి తదితరులు ఉన్నారు.

వినాయక చవితి వేడుకలకు రాట ముహూర్తం

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలకు సోమవారం శ్రీకారం చుట్టారు. స్థానిక షిర్డీ నగర్, పశువుల ఆసుపత్రి వీధి, పల్లపు వీధి, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లో పందిరి రాట వేశారు. తొలుత ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 27న వినాయక చవితి వేడుకలకు ఉత్సవ కమిటీల సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

శంఖవరం: మండలంలోని కత్తిపూడి రాణి బహద్దూర్ బుచ్చి సీతయమ్మ మహారాణి సత్రం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. శంఖవరం, రౌతులపూడి మండలాల్లో సత్రం భూములను కౌలుకు తీసుకున్న రైతులు, ఇతరులను సభ్యులుగా నియమించినట్లు సత్రం ఈఓ యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. సత్రం నూతన కార్యవర్గ సభ్యులుగా సోమరౌతుల చంద్రమౌళి, గజ్జి వరలక్ష్మి, దేవులపల్లి ప్రకాశ్, పక్కుర్తి సతీష్, ఉమ్మి వనలక్ష్మి, పెండ్యాల బేబీ, చిట్టా శివభవానీ, గవిరెడ్డి నాగలక్ష్మి, కామారెడ్డి కాశీలను నియమించారు. ఈ సభ్యుల్లో ఒక్కరిని చైర్మన్‌గా ఎన్నుకోనున్నట్టు ఈఓ తెలిపారు.

ఫ్రీ బస్సుపై అప్పుడే విమర్శలా ?

జగ్గంపేట: రాష్ట్రంలో ఫ్రీ బస్సు మొదలు పెట్టి మూడు రోజులు కాకుండానే ఫ్రీ బస్ పథకం ఫెయిల్ అయిందని వైఎస్సార్ సీపీ నేతలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. స్త్రీశక్తి పథకం పట్ల మహిళలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

శ్రీప్రకాష్ వ్యవస్థాపక వేడుకలు ప్రారంభం


పాటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల 49వ వ్యవస్థాపక వేడుకలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా గాతా రహే మేరా దిల్ పేరుతో ఏటా సంగీత పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా కీబోర్డు, హార్మోనియం వాయిద్యకారులు దుర్గాప్రసాద్, ఆల్‌ఇండియా రేడియో, దూరదర్శన్ గాయకురాలు ఆర్.సునీత హాజరయ్యారన్నారు. ముగింపు వేడుకల్లో సినీ గాయని కౌసల్య ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మూర్తి, డాక్టర్ బంగార్రాజు, డాక్టర్ రామకృష్ణారెడ్డి, సీతారాణి, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరస్వామికి విశేష పూజలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. పండితులు తెల్లవారుజామున స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకులు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు. ధారపల్లిలోని మల్లికార్జున స్వామి వారికి పండితుడు చీకట్ల వెంకటేశ్వరరవు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంతా వరదమయం


ఏలేశ్వరంలో నీట మునిగిన వరిపొలం

- విస్తారంగా వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన పంట పొలాలు

ఏలేశ్వరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ప్రస్తుతం నారుమళ్ల దశలో ఉండడంతో పెద్దగా నష్టం కలిగే పరిస్థితి లేదు. ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని క్వారీ ప్రాంతంలో కొండలపై నుంచి వర్షపు నీరు నర్సీపట్నం రోడ్డు మీదుగా ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు.

ముంపులోనే లోతట్టు ప్రాంతాలు

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు శ్రీరామ్ నగర్, శేషాద్రి నగర్, నల్గొండమ్మతల్లి ఆలయ సమీప ఇళ్లను వరద నీరు ముంచెత్తింది. రోడ్లపై సైతం వర్షపునీరు నిల్వ ఉండిపోవడంతో రాకపోకలకు ఆంతరాయం ఏర్పడింది. తుని పట్టణాన్ని ఆనుకుని శరవేగంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, భూములన్నీ లేఅవుట్లు వేయడంతో ఇళ్ల ముందు, రోడ్లపైన వరదనీరు నిలిచిపోయింది. కొద్దిపాటి వర్షాలకే ఈ పరిస్థితి నెలకొంటే భారీ వర్షాలు, తుపాన్లు వస్తే తమ పరిస్థితి ఏంటని ఆయా కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరదనీరు పోయేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఎస్.అన్నవరం శివారు శేషాద్రి నగర్‌లో ఇళ్ల ముందు, రోడ్లపై నిలిచిపోయిన వరద నీరు

గోకవరంలో ఎడతెరిపి లేని వర్షం

గోకవరం: మండలంలో సోమవారం రెండో రోజు ఎడెతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. వారపు సంత కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కొనుగోలుదారులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని తంటికొండ గ్రామంలో 40 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది.

160 ఎకరాల్లో ముంపు

జగ్గంపేట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జగ్గంపేట మండలంలో 160 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. జగ్గంపేట వ్యవసాయశాఖ ఏడీ జి.శ్రీనివాస్ సోమవారం పలు గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన వరిపంట, నారుమళ్లను పరిశీలించారు. రామవరంలో 120 ఎకరాలు, సీతానగరం గ్రామంలో 40 ఎకరాల్లో వరి పొలాల్లోకి నీరు చేరిందని, దీని వల్ల ఎటువంటి నష్టం ఉండదన్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు.

450 ఎకరాల్లో నీట మునిగిన పంట

కిర్లంపూడి: అల్పపీడనం ప్రభావంతో రెండు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలో సుమారు 450 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. మండలంలోని ముంపుకు గురైన వరి పొలాలను తహసీల్దార్ జె. చిరంజీవి, ఏఓ సుధామాధురి, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ సోమవారం పరిశీలించారు. పంట నష్టాన్ని నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. వారి వెంట వీఆర్‌ఓ సూర్యప్రకాశ్, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

మండలంలో పర్యటించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమవారం పర్యటించారు. ప్రత్తిపాడులో సుద్దగెడ్డ వాగు వల్ల నీట మునిగిన పంట భూములను మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. మండలంలోని ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ, టి.రాయవరం, ఒమ్మంగి, ధర్మవరం గ్రామాల్లో సుమారు 150 హెక్టార్లలోని వరి, 55 హెక్టార్లలో రాగి, 18 హెక్టార్లలో ప్రత్తి పంట నీట మునిగినట్టు మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ఎస్.దయాకర్, ఎం. రామభద్రరాజు, ఐ.సుధీర్‌కుమార్ నీట మునిగిన పంటను రక్షించుకునేందుకు రైతులకు పలు సూచనలిచ్చారు. అధిక వర్షాలకు వరి పంట ముంపునకు గురైతే పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎకరాలనికి 20 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్‌ను బూస్టర్ డోస్‌గా వేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి జోకా అమృత, వ్యవసాయ విస్తరణాధికారులు రఘు, రామకృష్ణ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


నీటమునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాస్


జగపతినగరంలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పొంగి పొర్లుతున్న కాలువలు

తొండంగి: రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు మండలంలోని కాలువలు పొంగిపొర్లుతున్నాయి. పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురువడంతో పీబీసీ, పంపా కాలువలు, ఇతర పంట కాలువలు పొంగి ప్రవాహిస్తున్నాయి. కోదాడ, ఎ.కొత్తపల్లి, కృష్ణాపురం, పి.అగ్రహారం, గోపాలపట్నం, కొమ్మనాపల్లి తదితర ప్రాంతాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. బెండపూడి జాతీయ రహదారిపై వై జంక్షన్ ఆర్చి వద్ద పంట కాలువలు ఆక్రమణకు గురవ్వడంతో అన్నవరం వెళ్లే రహదారిపై నుంచి వరదనీరు ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలు అంతరాయం కలిగింది.

ప్రత్తిపాడు: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన సోమవారం సాయంత్రం కాస్త తెరిపిచ్చింది. ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడ్డాయి. సుద్దగెడ వాగుకు వరదనీరు పోటెత్తింది. స్థానిక తోట వీధి, కొత్తపేట తదితర వీధుల్లో వాన నీరు రోడ్ల మీదుగా పారుతోంది. స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్, ఎంప్లాయీస్ కాలనీ, పంచాయతీ కార్యాలయం వెనుక వీధిలో వర్షపు నీరు పోయే మార్గం లేక ఇళ్ల మధ్య నిలిచిపోయింది.

నీట మునిగిన పత్తి చేలు


ఎన్.చామవరంలో నీటి ముంపులో పత్తి పంట

తుని రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి చేలల్లో వరదనీరు చేరుతోంది. అధిక వర్షాలకు పత్తి చేలు మునిగితే పూత దశలో ఉన్న మొక్కలు చనిపోవడం, గిడసబారిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారి బి.అశోక కుమార్ తెలిపారు. పత్తి చేలనుంచి నీటి నిల్వలను కాలువలు ద్వారా తీసి వేయాలని రైతులకు సూచించారు. చెరువు ఆయకట్టు, ముంపు ప్రాంతాల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో మెట్టలో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయని తెలిపారు. వర్షాలు ప్రభావంతో పొలాలు వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి. పరివాహక ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వరదనీరు తాండవ నదిలో ప్రవహిస్తూ సముంద్రంలో కలుస్తుంది. చెరువుల్లో వర్షపునీరు చేరుతుండడంతో ఆయకట్టు రైతుల్లో సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి.

సాగునీటి ప్రాజెక్టులకు జలకళ


ఒమ్మంగిలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ప్రత్తిపాడు రూరల్: అల్పపీడన ప్రభావంతో మండలవ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి వర్షం ఏకదాటిగా కురుస్తూనే ఉంది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత తెరిపినిచ్చింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇ.గోవకరంలోని సుబ్బారెడ్డి సాగర్, కిత్తమూరిపేటలోని కట్టుచింతల ప్రాజెక్టులు, పంట చెరువుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. వర్షం ప్రభావంతో జనజీవనం స్తంభించిపోయింది. అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఒమ్మంగిలోని రాజ్ చెరువు, పెద్ద గెడ్డ, చింతలూరు రామానుజం చెరువుల్లో నీరు ఉధృతంగా ప్రవహించడంతో శాంతిఆశ్రమం-ఒమ్మంగి మధ్య రాకపోకలకు ఆటంకం కలిగింది. ఆర్టీసీ బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. వరద నీటి ఉధృతికి ఒమ్మంగి, వాకపల్లి, పోతులూరు తదితర గ్రామాల్లో వరి పంట నీట నీట మునిగింది. మండలంలోని ఒమ్మంగిలో నీట మునిగిన వరి పంటను మండల వ్యవసాయ అధికారి జోకా అమృత పరిశీలించారు.


నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

దేవస్థానానికి నిధులు సమకూర్చాలని వినతి


కలెక్టర్ ప్రశాంతికి వినతి పత్రం అందిస్తున్న తంటికొండ దేవస్థానం సభ్యులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు సమకూర్చాలని దేవస్థానం కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు సమకూర్చుతున్న నేపథ్యంలో తంటికొండ దేవస్థానానికి కూడా నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బద్దిరెడ్డి అచ్చన్నదొర, బొట్టా రామకృష్ణ, మలిరెడ్డి సిరి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో స్త్రీ పాత్రపై అవగాహన

గండేపల్లి: సమాజంలో స్త్రీ పాత్రపై ప్రముఖ సైకాలజిస్ట్ అడపా లక్ష్మి విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నికల్ కళాశాలలో సోమవారం స్త్రీ శక్తి-సురక్షిత సమాజం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్ మీడియా వల్ల కలిగే దుష్ప్రభావాలు, లక్ష్య సాధనలో టీనేజ్ ఆకర్షణ వల్ల కలిగే అడ్డంకులు, వ్యక్తిగతంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్, డీన్ వి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు సోమవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన నల్ల వెంకటరమణ, దండ అప్పారావు వేర్వేరు ప్రమాదాల్లో గాయపడ్డారు. మురళీకృష్ణంరాజు వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నల్ల వెంకట రమణకు రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ జువ్వల బాబులు, వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, తూపాటి బాబ్జి, తిమ్మిశెట్టి రాజా, దండ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతకు సన్మానం


వీఆర్వో కిషోర్‌ను సన్మానిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

ఏలేశ్వరం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న వీఆర్వో అవసరాల కిషోర్‌ను పట్టణంలో సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో వీఆర్వో కిషోర్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు. వీఆర్వో కిషోర్ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో వైభోగుల సుబ్బారావు, ఎ.చలమయ్య, మలిరెడ్డి సూరిబాబు, తొండారపు రాంబాబు, గూడవిల్లి అర్జునరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉద్యమ ఆధార్ శిబిరం

ప్రత్తిపాడు: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఉచిత ఉద్యమ ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నట్టు వెలుగు ఏపీఎం జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంఎస్ఎం పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) సంయుక్త ఆధ్వర్యంలో చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలు, పురుషులకు అవసరమైన ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఉపాధి పథకాలను పొందేందుకు, వ్యాపారాల అభివృద్ధికి, బ్యాంకుల నుంచి రుణాలను పొందేందుకు ఉద్యమ ఆధార్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. చిరు వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్ఫూర్తి ప్రదాత నేతాజీ

ఏలేశ్వరం: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ స్ఫూర్తి ప్రదాత అని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలో సోమవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి నిర్వహించారు. విగ్రహదాత తూమురౌతు గురయ్య ఆధ్వర్యంలో స్థానిక కోనేటిబడి వద్ద నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ కీలకపాత్ర పోషించారన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేసి స్వాతంత్ర్య పోరాటంలో తన సైన్యాన్ని వినియోగించారన్నారు. నేటియువత నేతాజీ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు అలమండ దుర్గావెంకటప్రసాద్, కౌన్సిలర్ చలమయ్య, కందుల ప్రభాకర్, బోద చిరంజీవిరావు, వుడతల రమణారావు, తదితరులు పాల్గొన్నారు.


నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గురయ్య తదితరులు

బొమ్మండమైన కళ


- ప్రత్తిపాడులో ఫొటో స్టూడియోకి 76 వసంతాలు
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


ప్రత్తిపాడులో 1950లో ఏర్పాటు చేసిన ఫొటోస్టూడియో

ప్రత్తిపాడు: మెట్ట ప్రాంతంలో అది మొట్టమొదటి ఫొటో స్టూడియో. ఈ స్టూడియో మంగళవారం 76వ వసంతంలోకి అడుగు పెడుతోంది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆ స్టూడియో గురించి క్లుప్తంగా ...మెట్టప్రాంతమైన ప్రత్తిపాడులో 1950లో తొలిసారిగా దివంగత ఫొటో గ్రాఫర్ సలాది పెరుమాళ్లరావు తాటాకుపాకలో ఈశ్వర్ స్టూడియోను స్థాపించారు. చుట్టపక్కల గ్రామాలకు వెళ్లి ఆయన ఫొటోలు తీసేవారు. 60 ఏళ్ల పాటు ఫొటో గ్రఫీలో సేవలు అందించారు. ఎందరో ఔత్సాహికులను ఫొటోగ్రాఫర్లగా తీర్చిదిద్దారు. ఆయన మరణానంతరం ఆయన కుమారుడు సలాది కృష్ణ ఈశ్వర స్టూడియోను కాలానుగుణంగా డిజిటల్ స్టూడియోగా మార్చి, అదే వృత్తిలో కొనసాగుతున్నారు. ఈయన వద్ద ఆనాటి ముసుగు కెమెరా (ఫీల్డ్ కెమెరా) నుంచి నేటి ఆధునిక డిజిటల్ కెమెరా వరకూ అంటే ఆనాటి పురాతన కెమెరాల నుంచి నేటి ఆధునిక కెమెరాల వరకూ అన్నీ ఆయన వద్ద భద్రంగా ఉన్నాయి. సలాది కృష్ణ క్లిక్ మనిపించిన ఛాయా చిత్రాలకు కలర్, బ్లాక్ అండ్ వైట్ విభాగాల్లో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు, పురస్కారాలు, మెరిట్ సర్టిఫికెట్లు వరించాయి. ఫొటోగ్రాఫర్‌కు హృదయ పరిశీలన, చక్కని అభిరుచి ఉంటే ఆణిముత్యాల వంటి దృశ్యాలను కెమెరాలో బందించవచ్చని అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ తెలిపారు.


విజయవాడలో మార్నింగ్ వాక్ ఛాయాచిత్రానికి రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న కృష్ణ

ఫొటోగ్రఫీ నాకు జీవనాధారం



నా తండ్రి సలాది పెరుమాళ్లరావు మెట్ట ప్రాంతానికి తొలి ఫొటోగ్రాఫర్. ఆయన నుంచి వారసత్వంగా సంక్రమించిన ఫొటోగ్రఫీ నాకు జీవనాధారం. ఫొటోగ్రఫీపై ఉన్న మక్కువతోనే కెమెరాలో బంధించిన చిత్రాలను జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలకు పంపుతున్నాను. ఫొటోగ్రఫీపై అభిరుచి ఉంటే ఆణిముత్యాల వంటి చిత్రాలను తీయవచ్చు.

– సలాది కృష్ణ, అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత, ప్రత్తిపాడు


అంతర్జాతీయ ప్రదర్శనలో కలర్స్ విభాగంలో మూడు అవార్డులు గెలుచుకున్న స్పీడ్ డ్యాన్స్ చిత్రం


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రస్థాయిలో అవార్డు గెలుచుకున్న మార్నింగ్ డ్యూటీ చిత్రం

చెట్టును ఢీకొట్టిన కారు


ఎ.కొత్తపల్లి వద్ద చెట్టును ఢీకొట్టడంతో దెబ్బతిన్న కారు

తొండంగి: మండలంలోని శృంగవృక్షం నుంచి ఎ.కొత్తపల్లి వెళ్లే రహదారిలో సోమవారం కారు చెట్టును ఢీకొట్టింది. స్థానికుల కథనం ప్రకారం ఒంటిమామిడి వైపు నుంచి అన్నవరం వస్తున్న మారుతి కారు ఎ.కొత్తపల్లి కోమటి చెరువు మలుపు వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో డ్రైవర్ స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. కారు ముందు భాగం నుజ్జయ్యింది. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.